# నేనువిన్న ఆకాశవాణి (నాటికా) కార్యక్రమాలు

రచన:- శ్రీ రోహిణి

సెప్టెంబరు 20 రాత్రి 8 గంటలకు హైదరాబాద్ కేంద్రం నుంచి "నిరుద్యోగులు" అనే నాటిక ప్రసారమైంది. ద్వివేదుల సోమనాథశాస్త్రిగారి రచన. నాటక కళా ప్రపూర్ణ పద్మశ్రీ స్థానం నరసింహారావుగారి నిర్వహణ. నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకునేచోట కాచుక్కూర్చుని వారిని అంబర్ చరఖా కేంద్రంలో జేర్పించే ధర్మారావుగారి ఉద్యోగాల్లాంటి అనేకవాట్ని కలిగిఉన్న ఈ దేశంలో ప్రత్యేకించి నిరుద్యోగ సమస్యమీద నాటకాల నవసరం! అంబర్ చరఖా అదనపు రాబడికి కొంతవరకూ ఉపయోగించవచ్చు; అది నిరుద్యోగ నిర్మూలనానికి తద్వారా ఓ నాటికకు కథావస్తువు గావటానికి అంతగా పనికి రాదేమో.

సెప్టెంబరు 23 రాత్రి 9-15 కు శ్రీనివాస చక్రవర్తిగారు వ్రాసిన "మహాకవి పుష్కిన్" నాటికను విజయవాడ కేంద్రం ప్రసారం చేసింది. రామచంద్ర కాశ్యపగారు పుష్కిన్ పాత్ర చక్కగా నిర్వహించారు. నాటిక బాగుంది.

సెప్టెంబరు 24 రాత్రి 9-45 కు కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు ఆంధ్ర వాఙ్మయ వికాసాన్ని యుగాలుగా విభజించి పది నాటకాలుగానూ రూపకాలుగానూ వ్రాసినవాటిలో మొదటిది "నన్నయయుగం - భారతావతరణం" హైదరాబాద్ కేంద్రం వారు ప్రసారం చేసారు. శ్రీ త్రిపురనేని గోపీచంద్ నిర్వహణ. సంగీతం శ్రీ మంచాల జగన్నాథరావు, హైదరాబాద్ విజయవాడ కేంద్రాల నిలయ విద్వాంసులు పాల్గొన్నారు.

"ఇవి అందరికీ నచ్చితేనచ్చవచ్చు.... అందరికీ నచ్చే విధంగా (అందరూ) వ్రాయడం కొంచెం కష్టమేను. కానీ ఒక్క విషయం మాత్రం అందరూ గమనించాలి. ఈ నాటకాలలో ఆంధ్రముద్ర ప్రస్ఫుటంగా కనిపిస్తుంది." అనే భావం వచ్చే మాటలతో రచయిత ఈ మొదటి నాటకాన్ని పరిచయం చేసారు దేవతలకు, వార్నిబట్టి మర్త్యులకు (శ్రోతలకు) వీనుల విందు చేసిన ఈ నాటకం అమోఘంగా సాగింది. వాగ్దేవిని మోహింప జేసిన "ఆంధ్ర భారతావిష్కరణోత్సవం" ఏ ఆంధ్రుడ్ని గర్వింప జేయదు? ద్రావిడ భాషా ప్రసక్తి ఆంధ్రుడు కాని ఒక దాక్షిణాత్యుని పాత్ర లేకుండా మరింత బాగుండేదేమో ఆలోచించవలసినది విజ్ఞులైన రచయితలు.

సెప్టెంబరు 27 రాత్రి 8 గంటలకు "సిఫార్సు" అనే తమిళ నాటకానువాదాన్ని మద్రాసు కేంద్రంవారు ప్రసారం చేసారు. తమాషాగా ఉంది నాటిక.

సెప్టెంబరు 29 రాత్రి 9-30 కు విజయవాడ కేంద్రంనుంచి "శాంతి" అనే నాటిక ప్రసారమైంది. దీపావళి బాణా సంచా కాల్చాల పోటీతో దగ్ధమైన ఓ గ్రామంలో కాలిపోవడాని కేమీలేని ఓ పూజారి గ్రామ పెద్దలకు బాణా సంచా దాని వెనక ఉన్న స్పర్ధలూ అవి రగుల్కొంటే వచ్చే దుష్ఫలితాలూ చెప్పి కళ్ళు తెరిపించి కృతజ్ఞతలందుకుంటాడు. పనిలోపనిగా యుద్ధం వెనకాలకూడా ఇంత తతంగమూ మళ్ళీ మాట్లాడితే ఇంతకన్నా ఎక్కువే వుంటుందని అందుకని అది కూడదనీ బోధిస్తాడు. యుద్ధం అంటే పేపర్లలో మటుకు చదివి ఆనందించే గ్రామ పెద్దలు బాణా సంచా కాల్చాలను చేతులు కాల్చుకుని ఇక యుద్ధం అనేది రాకూడదనే నిశ్చయం లాంటి దానికొస్తారు. ఇది "శాంతి" నాటిక. దీపావళి టపాకాయల అట్టహాసానికి చెదిరిపోయే విజ్ఞులు రాజ్యాధినేతలైతే "శాంతి" దోహదానికి ఈ నాటిక బాగా పనికి వస్తుంది!

సెప్టెంబరు 30 రాత్రి 9-15 కు హైదరాబాద్ కేంద్రం నుంచి శ్రీ రజని రచించి నిర్వహించిన "ఇందుమతి" అనే నాటిక ప్రసారమైంది. ఇందు శ్రీ రజని, శ్రీ దాశరథి, శారదా కుమారి, దుర్గ గారలు పాల్గొన్నారు. వాద్య సంగీత గోష్ఠిలో పడిపోయి మాట పెగలనందున ఏమీ వినిపించ లేదు. Speech line వినిపించినంతవరకు ఒక ముసలి మగడు పడుచు పెళ్లాం ఏట్లో సరసాలాడుకోడం (విధి లేక ఒకర్నొకరు మెచ్చుకోడం) ఇంతలో ఎందుకో పెళ్ళాం కనిపించకుండా పోవటం ఆమెకోసం అట్టే దిగులు పెట్టుకు చిక్కిపోక ప్రజాపాలన చేసుకోమని ఓ మహానుభావుడు చెప్పటం వగైరా లాంటిదేదో దీని కథ అని పిస్తుంది. అయినా పూర్తిగా వినకుండా సమీక్షించే ధైర్యం ఇంకా గాలేదు. అంచాత ఈ నాటిక వినని వాటిలోనే జమ కట్టడం మంచిదేమో.

అక్టోబరు 1 మధ్యాహ్నం 3 గంటలకు లోగడ వనితావాణి కార్యక్రమంలో వరుసగా ప్రసారమైన "వినోదిని" అంతా ఒకేసారిగా ప్రసారమైంది.

రాత్రి 9-45 కు కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన "తిక్కన యుగం-ఉభయ కవి మిత్రము" హైదరాబాద్ కేంద్రం నుంచి ప్రసారమైంది. నిర్వహణ శ్రీయుతులు త్రిపురనేని గోపీచంద్, భాస్కరభట్ల కృష్ణారావు. పర్యవేక్షణ శ్రీ నాయని సుబ్బారావు సమర్పణ శ్రీ స్థానం. తిక్కనగారి యుద్ధ వర్ణన అద్వితీయం. ఈ రూపకం కూడా యుద్ధాలతోనే నడిచింది.

Source: Press Academy Website, Chukkani, Oct 1961

Disclaimer: This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation. Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/